క్లుప్తంగా

అధ్యాపకుడికి అభినందన


అభినందిస్తున్న వీసీ

కేయూ క్యాంపస్: ఐదో ఆల్ఇండియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుడు సుమంత్ షటిల్ బ్యాడ్మింటన్‌లో 40ప్లస్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో సుమంత్ మూడు పతకాలు సాధించారు. మంగళవారం సుమంత్‌ను వీసీ రమేష్, డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్ అభినందించారు.

భవన నిర్మాణానికి రూ.33 కోట్లతో ప్రతిపాదన

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవన నిర్మాణానికి రూ.33కోట్ల మంజూరీకి ప్రభుత్వానికి ప్రతిపాదించి మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపెల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అలుమ్ని అసోసియేషన్ బాధ్యులు హైదరాబాద్‌లో వినోద్‌కుమార్‌ను కలిశారు. ఈ నెల 15న కేడీసీలో న్యాక్ పీర్ టీం సందర్శించనున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొనాలని కోరారు. డాక్టర్ సోమిరెడ్డి, డాక్టర్ ఎస్.వినోద్‌రావు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి, సంజీవయ్య కలిశారు.

బాలల రక్షణకు చొరవ చూపాలి

హన్మకొండ అర్బన్ : జిల్లాలో బాలల రక్షణకు మరింత చొరవ చూపాలని అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కోరారు. మంగళవారం అభ్యుదయ సేవా సమితి ప్రతినిధులు నూతన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.

ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

కాశిబుగ్గ: గుడిసె వాసులకు, ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఏసీరెడ్డి నగర్‌లోని కుసుమ రఘునాథభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు ప్రత్యూష, భవాని, జ్యోతి, ఉదయశ్రీ, సునీత, అస్మా, అనిత పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో క్రీడా పోటీలు

రామన్నపేట : నగరంలోని లాల్‌బహదూర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ.హెచ్.రావు డిగ్రీ అంతర్ తరగతుల క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. వివిధ సంస్థల్లో రెండు శాతం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, చెస్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ ప్రభాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాటి చెట్లు నరికివేత

హసన్‌పర్తి: 56వ డివిజన్ బ్యాంక్‌కాలనీ ప్రాంతంలోని తాటిచెట్లు నరికి వేశారు. నగరానికి చెందిన బొల్లం లింగారెడ్డి అనే రియల్టర్ ఈ వ్యవహారానికి పాల్పడినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు చింత రమేష్‌గౌడ్ తెలిపారు. 12 చెట్లు నేలమట్టం చేయడం వల్ల వాటిపై ఆధారపడి ఉన్న కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని కార్పొరేటర్ పిరంగి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీంధర్‌నాథ్ సందర్శించారు. అనంతరం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనిల్‌కుమార్, దూలం శ్రీనివాస్, కృష్ణమూర్తి, రాజేందర్ పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయండి

వరంగల్ అర్బన్ : ఆస్తి పన్ను 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.41.39కోట్లు వసూలు చేయాలని బల్దియా అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్ ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో పెండింగ్ ఫైల్స్, పన్నుల సేకరణ పురోగతిపై సర్కిళ్లవారీగా సమీక్ష నిర్వహించారు. లక్ష్యాన్ని మార్చి 31లోగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో అనిసుర్ ఉర్ రషీద్, జోనా, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, సుదర్శన్, షహజాధి బేగం, యూసుఫోద్దీన్, శ్రీనివాస్ ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

మామునూరు: వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బొల్లికుంట క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్నాయి. కారు వెనకనే ఉన్నా మరో బైక్ కారును బలంగా ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం సాయంత్రం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట క్రాస్ రోడ్డు వద్ద జరిగింది.

రేపు సదస్సు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సదస్సును ఈ నెల 9న కాజీపేట సోమిడి సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ సత్యనారాయణ తెలిపారు.

గరంగరంగా మండల సభ

- పశువుల మందులు మింగేస్తున్నారు..!
- ఎక్కువ ధరకు ఫర్టిలైజర్లు అమ్ముతున్నా పట్టించుకోరా?
- మండల పరిషత్‌లో సభ్యుల ఆగ్రహం


పశువైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

హసన్‌పర్తి: ప్రభుత్వం నుంచి పశువైద్యశాలకు సరఫరా అవుతున్న మందులను రైతులకు ఇవ్వకుండా అధికారులు (బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని) మింగుతున్నారని మండల పరిషత్ సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్యసమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖపై చర్చ సందర్భంగా సభ్యులు పశువైద్యాధికారి క్రాంతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం కోసం పశువులను తీసుకొస్తే మందులు ఇవ్వకుండా బయట కొనుగోలు చేయాలని రాసి ఇస్తున్నారని చెప్పారు. వైద్యాధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. గోపాల మిత్ర జాడలేదన్నారు. గ్రామాలకు వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులే గ్రామాల్లోకి వచ్చి పశువులకు చికిత్స అందిస్తూ వేలాది రూపాయాలు దోచుకుంటున్నారని సూదన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులు ఎక్కువ ధరకు యూరియాను విక్రయిస్తున్నట్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. పీఏసీఎస్‌లకు నాసిరకం ఫర్టిలైజర్లు అందిస్తూ ప్రైవేట్ షాపు నిర్వాహకులకు నాణ్యమైన సరుకులు సరఫరా చేస్తున్నారని పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గోపాల్ రెడ్డి ఆరోపించారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ అనురాధ తెలిపారు. మొగిపురుగు ప్రభావం కారణంగా పంట దెబ్బతిన్నదన్నారు. ప్రస్తుతం పంట బతికే పరిస్థితి చాలా తక్కువ అని ఏఓ పేర్కొన్నారు. ఎస్.హెచ్ –569 పనిని మరో సర్వేయర్‌కు ఇవ్వడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతన్నారని ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ తెలిపారు. కనీసం ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని సభాదృష్టికి తీసుకొచ్చారు.

తరలనున్న సబ్‌స్టేషన్..

హసన్‌పర్తికి మంజూరైన సబ్‌స్టేషన్ మరో ప్రాంతానికి తరలివెళ్లనున్నట్లు సభ్యులు తెలిపారు. వెంటనే సర్కార్ భూమిని గుర్తించి విద్యుత్‌శాఖ అధికారులకు అప్పగించాలని కోరారు. సూదన్‌పల్లిలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఇప్పటి వరకు మూడు సార్లు జరిగిన సమావేశాల్లో మొర పెట్టుకున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. సర్వసభ్యసమావేశం అంటే అధికారులు చెప్పింది వినడానికి రావడమా.. ?అని ఆగ్రహా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రేనకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్ రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోర్టు కార్మికులకే అన్యాయమా..?


దీక్షను ప్రారంభిస్తున్న భిక్షపతి మాదిగ

హన్మకొండ: జిల్లా కోర్టులోని కార్మికులకే అన్యాయం జరిగితే ఎక్కడికి వెళ్లాలని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. వరంగల్ జిల్లా కోర్టులో గత తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్ వర్కర్స్‌ను తొలగించడాన్ని నిరసిస్తూ మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. వారం రోజుల పాటు చేపట్టనున్న ఈ దీక్షలను టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, సీఐటీయూ నాయకుడు టి.ఉప్పలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంట్రాక్టర్ గొట్టిపాటి రామచంద్రరావు 11 నెలల క్రితం లేబర్ కాంట్రాక్ట్ దక్కించుకొని 11 మంది హౌస్ కీపింగ్ వర్కర్స్‌కు నియమించుకుని ఒక్కొక్కరికీ నెలకు రూ.5,000 వేతనంతో చెల్లించాడని తెలిపారు. ఈఎస్ఐ,ీపీఎఫ్ చెల్లిస్తానని వీరి నుంచి వసూళ్లు చేసి కాజేశాడని ఆరోపించారు. తొమ్మిది సంవత్సరాలుగా పని చేస్తున్నవారిని అకారణంగా తొలగించాడని మండిపడ్డారు. కోర్టులో పని చేస్తున్న వారికి అన్యాయం జరిగితే, ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ గొట్టిపాటి రాంచందర్ రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని ఎడల పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గౌడ కులస్తులందరూ ఏకతాటిపైకి రావాలి

కాజీపేట రూరల్: గౌడ కులస్తులందరూ ఏకతాటిపైకి రావాలని, రాజకీయంగా ఎదిగి మన హక్కుల సాధనకు ఉద్యమించాలని కాజీపేట మండల గోపా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మడికొండ రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో మంగళవారం మడికొండ గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు రాజన్‌బాబు అధ్యక్షతన గోపా (గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్) క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోపా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా గోపా సంఘం సభ్యులు బత్తిని రాజేందర్ గౌడ్, గౌని సాంబబయ్య గౌడ్ మాట్లాడారు. నర్సింగ్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజు, రాజేంద్రప్రసాద్, రాజు, రాజేష్, సదానందం పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


ప్రసంగిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

కాజీపేట: వినూత్న రీతిలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమిడి శివారులోని నేతాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీస్ కళా జాత బృందం సభ్యులు సైబర్ మోసాలపై ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఐ గట్ల మహేందర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎనుగుల రాకేష్ రెడ్డి, ఎస్సై మాచర్ల శ్వేత పాల్గొన్నారు.

విద్యార్థినులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ


పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న దాతలు


మెటీరియల్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని ఆనంద నిలయంలోని అనాథ విద్యార్థినులకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి, టీఎస్ ఎన్పీడీసీఎల్ ఏడీ బక్క దానయ్య, పాశం రాజేశ్వర్ పుస్తకాలు, బ్యాగులు, టవల్స్ అందించారు. మంగళవారం ఆనంద నిలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంజీఎం ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రామ్మోహన్ చేతుల మీదుగా అనాథ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, టవల్స్ అందించారు. విద్యార్థులతోపాటు, ఆశ్రమంలో పనిచేస్తున్న సిబ్బందికి అనారోగ్య సమస్యలు ఉంటే తగిన చికిత్స అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రౌతు రమేష్ కుమార్, స్వదేష్ కుమార్, రాజారవు, చలపతి, కృష్ణ, రాజేశ్వర్, వినోద్ కుమార్, శ్యామ్ కుమార్, విజయ్, సుజాత పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం పూర్వ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు రూ.50వేల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తండమల్ల వేణు, అయ్యాల దానం, రామకృష్ణ ప్రసాద్, బండి యాదగిరి, సయ్యద్ బందిలీ పాల్గొన్నారు.

కాకతీయ కెనాల్ నీరు వినియోగం

వరంగల్ అర్బన్: కాకతీయ కెనాల్ నుంచి రా వాటర్‌ను శుద్ధి చేస్తూ, పలు కాలనీలకు తాగునీటి సరఫరా చేసే ప్రక్రియకు ఇంజినీర్లు ఉపశమనం సోమవారం సాయంత్రం నుంచి శ్రీకారం చుట్టారు. ఈనెల 6న 'సాక్షి'లో 'తాగునీటి సరఫరా బంద్' వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కమిషనర్ ప్రావీణ్య, బల్దియా ఇంజినీర్లతో చర్చించి కెనాల్ నీటిని వినియోగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బల్దియా ఇంజినీర్లు కాకతీయ కెనాల్ నుంచి కేయూసీ ఫిల్టర్ బెడ్, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌కు రా వాటర్ తీసుకొని శుద్ధి చేస్తున్నారు. హన్మకొండ,వరంగల్ ప్రాంతాల్లో పలు కాలనీల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. అత్యవసరమైన కాలనీలకు వాటర్ ట్యాంకర్లను పంపిస్తామని బల్దియా ఇంజినీర్లు పేర్కొన్నారు. ధర్మసాగర్ చెరువు వద్ద బటర్ ఫ్లై వాల్వ్‌ల ఏర్పాటు ప్రక్రియ బుధవారం సాయంత్రం కల్లా పూర్తి కావాల్సి ఉంది. కానీ మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని ఇంజినీర్లు పేర్కొన్నారు. గురువారంలోగా పనులు పూర్తయితే 8 గంటల సమయం తర్వాత ఫిల్టర్‌బెడ్లకు, రిజర్వాయర్లకు నీరు చేరుతుంది. అందువల్ల శుక్రవారం ఉదయం నుంచి యాథావిధిగా రోజు నీటి సరఫరా జరగనుందని బల్దియా ఇంజినీర్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

డ్రెయినేజీలు నిర్మిస్తాం..

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్ లక్ష్మీగణపతి కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి మంగళవారం పర్యటించారు. డ్రెయినేజీలను పరిశీలించారు. త్వరలోనే డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సతీష్, ఇంద్ర, అవినాష్, పాండురంగ, రాజు పాల్గొన్నారు.

నేడు విశ్వనాథుడి సంస్మరణ సభ

హన్మకొండ కల్చరల్: వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాతపస్వీ కె.విశ్వనాథ్ స్మృతిలో విశ్వనాథుడి సంస్మరణ సభ నిర్వాహకులు మహ్మద్ సిరాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మాస్టర్ జీ కాలేజీలో బుధవారం సాయంత్రం 5గంటలకు నిర్వహించే సభకు అభిమానులు, కళాకారులు, సాహితీప్రియులు హాజరుకావాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు.. జరిమానాలు

కాజీపేట: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రెండు రోజుల జైలు, 15 మందికి రూ.28,700 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ వెల్లడించారు. సోమవారం రాత్రి కాజీపేటలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు చెప్పారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా నూతి చందు బాబుకు జైలు శిక్ష విధించగా మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

విచారణ జరిపించాలి

హన్మకొండ: హనుమకొండ విజయపాల్ కాలనీలోని నవయుగ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. విద్యార్థి వివేక్ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారనే అనుమానాలున్నాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలని కోరారు.

వాల్తేరు వీరయ్య విజయోత్సవం

కాజీపేట: కాజీపేట శాంభవి థియేటర్‌లో మంగళవారం రాత్రి వాల్తేరు వీరయ్య విజయోత్సవ వేడుకలను కరాటే ప్రభాకర్ ప్రారంభించారు. చిరంజీవి అసోసియేషన్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బొల్ల శివకుమార్ ఆధ్వర్యంలో షీల్డ్‌ను బహుకరించారు. నిరంజన్, మధు, సందీప్, భరత్, రాము, శరత్, వీరేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హన్మకొండ: హనుమకొండ ఎన్జీఓస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం 2023 క్యాలెండర్‌ను భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి తోట నవీన్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, నాయకులు పాల్గొన్నారు

విరిగిపడిన విద్యుత్ స్తంభం

ఖిలా వరంగల్: పడమరకోటలోని మట్టికోట గండి వద్ద విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. పడమరకోటకు విద్యుత్ సరఫరా నిల్చి అంధకారం నెలకొంది. దీనిపై కార్పొరేటర్ బైరబోయిన ఉమాదామోదర్‌యాదవ్ తక్షణమే స్పందించారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ అధికారులతో కలిసి నూతన స్తంభం ఏర్పాటు చేయడంతో రాత్రి 8గంటలలోపు కరెంట్ సరఫరా పునరుద్ధరించారు.

జాతీయస్థాయి పోటీలకు పలువురి ఎంపిక


అఖిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


భానుప్రియను అభినందిస్తున్న కార్పొరేటర్


సింధు


రాగిణి


అభినందిస్తున్న బ్రదర్ అరుణ్, ప్రకాశ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన దాడి అఖిల్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాత్‌ఫైండర్ పాఠశాల ప్రిన్సిపాల్ శౌర్య తెలిపారు. ఇటీవల జేఎన్ఎస్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అఖిల్ పాల్గొని జాతీయస్థాయికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 8న బీహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ శౌర్య చెప్పారు.

ఖిలా వరంగల్: జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు వరంగల్ 17వ డివిజన్ దూపకుంట గ్రామానికి చెందిన మారపాక రాజీవ్‌గాంధీ కుమార్తె భానుప్రియ ఎంపికైంది. ఈమేరకు మంగళవారం దూపకుంటలో కార్పొరేటర్ గద్దె బాబు భాను ప్రియను అభినందించారు.

వరంగల్ స్పోర్ట్స్: 14న బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సబ్ జూనియర్స్ విభాగంలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ తాబేటీ రాజేందర్ తెలిపారు. సింధు షాట్‌పుట్, డిస్కస్‌త్రో ఈవెంట్లలో, రాగిణి 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు వెంకటేశం, మోజెస్, రవి, వెంకట్రామిరెడ్డి, అనిత, మాధవి క్రీడాకారులను అభినందించారు.

కాజీపేట రూరల్: కాజీపేట సేయింట్ గ్యాబ్రియల్ స్కూల్ విద్యార్థులు పాట్నాలో జరిగే నేషనల్ అథ్లెటిక్ మీట్‌కు అర్హత సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు.

బడ్జెట్ ప్రతుల దహనం


ప్రతులు దహనం చేస్తున్న విద్యార్థినాయకులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాభివృద్ధిని విస్మరించిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు విమర్శించారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి, నిరసన నినాదాలు చేశారు. అనంతరం నర్సింహారావు మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యమే కనపడుతుందన్నారు. నిరసనలో ప్రవీణ్, శశి, పవన్‌కల్యాణ్, సోమేష్, యాదగిరి, లక్ష్మి, శ్రీజ, సంగీత, పవన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

వరంగల్: 2023–24బడ్జెట్‌లో కేవలం 6.57శాతం కేటాయించి విద్యారంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు హకీంనవీద్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉన్నతవిద్యకు రూ.3001కోట్లు కేటాయించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. బడ్జెట్ పూర్తిగా విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ అని పేర్కొన్నారు.

'వడుప్సా' కమిటీ ఎన్నిక


శ్రీకాంత్ రెడ్డి, అధ్యక్షుడు

హన్మకొండ: వడుప్సా హనుమకొండ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని రామన్ హైస్కూల్‌లో నిర్వహించిన వడుప్సా హనుమకొండ డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శ్రీకాంత్ రెడ్డి (శ్లోకా హైస్కూల్), ప్రధాన కార్యదర్శిగా తీగల శ్రీధర్ (భవిష్య స్కూల్), కోశాధికారిగా ఎం.శ్రీనివాస వర్మ (స్మైల్ డీజీ స్కూల్), ఉపాధ్యక్షులుగా నరేష్ చంద్ భరత్, ఈశ్వర్ కుమార్, సహాయ కార్యదర్శులుగా సంపత్ కుమార్, సాజిద్ మీర్జాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి టి.డి.టామే తెలిపారు. ఈ సమావేశంలో వడుప్సా జిల్లా అధ్యక్షుడు రమేష్‌రావు, హనుమకొండ జోన్ అధ్యక్షుడు రాజేష్, జ్ఞానేశ్వర్, సతీష్, ముక్తీశ్వర్, కుమార్, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

'సైబర్' 'ముద్ర'!



కేంద్ర పథకాలపై సైబర్ నేరగాళ్ల కన్ను

- అగ్రిమెంట్ చార్జీలంటూ ప్రజలకు గాలం
- రుణం మంజూరైందంటూ నకిలీ లెటర్లు
- వరంగల్ పోలీసులకు అందుతున్న ఫిర్యాదులు

సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ సరికొత్త ఆలోచనలకు పదును పెడుతున్నారు. సామాన్యులు, ఉద్యోగులనూ వదలని నేరగాళ్లు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ పథకాలపై పడ్డారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ముద్ర యోజన(పీఎంఎంవై)ను తమ దందాకు పావుగా వాడుకుంటున్నారు. 'మీకు రుణాలు మంజూరయ్యాయి.. అగ్రిమెంట్ చార్జీలు కట్టాలంటూ వల విసురుతున్నారు.. ఇలా దశలవారీగా రూ.10లక్షల రుణం కోసం రూ.లక్షలకుపైగానే వివిధ చార్జీలు వల వేసి మస్కా కొడుతున్నారు..' ఈ తరహా కేసులు ఒకటి, రెండు ఇటీవల వరంగల్ పోలీసులకు చేరాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముద్ర రుణాలు కావాలంటే నేరుగా బ్యాంక్‌లకు వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పీఐబీ ఫాక్ట్‌చెక్ ట్వీట్ ద్వారా నకిలీ లెటర్లు వస్తున్నాయని, ఈ విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.


ప్రజల ఆశను క్యాష్ చేసుకొని..

కుటుంబాలను పోషించుకోవడం.. జీవితంలో స్థిరపడాలనుకునే వారు చిరు వ్యాపారాల వైపు మొగ్గు చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముద్ర రుణాలను తీసుకొని చాలా మంది వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. వాణిజ్య బ్యాంకులు, ఆర్ఆర్‌బీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, కోఆపరేటివ్ బ్యాంక్‌లు, ఏబీఎఫ్‌సీల వంటివి ఈ పథకం కింద రూ.10లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. ముఖ్యంగా మాన్యుఫ్యాక్చరింగ్(తయారీ రంగం), ట్రేడింగ్, సర్వీసెస్ రంగంలోని వ్యాపారాలకు రుణాలు ఇస్తారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు వ్యాపారాలకు కూడా రుణాలు తీసుకోవచ్చు. అంటే.. షాపు పెట్టుకోవడానికి, త్రీ, ఫోర్ వీలర్ కొనుగోలు చేసేందుకు, బ్యూటీపార్లర్/జిమ్ వంటివి పెట్టుకోవడానికి, ఫౌల్ట్రీ, సీడ్ ప్రాసెసింగ్ తదితర వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు తీసుకోవచ్చు. రూ.50వేల వరకు ఎలాంటి మార్జిన్ ఉండదు. ఈ లిమిట్ దాటితే 10 శాతం మార్జిన్ ఉంటుంది. అయితే ఈ రుణాల కోసం బ్యాంక్‌లతోపాటు ఆన్‌లైన్ ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే 'వీరి డాటాను సంపాదించిన సైబర్ నేరగాళ్లు నేరుగా బాధితులకే మీకు రుణం మంజూరైందంటూ నకిలీ లెటర్లు పంపిస్తున్నారు. అగ్రిమెంట్ చార్జీలు చెల్లించాలంటూ ఆన్‌లైన్ ద్వారా బాధితుల నుంచి నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. అందుకే వాట్సాప్, మెయిల్స్ ద్వారా వచ్చే ఈ తరహా మెసేజ్‌లకు స్పందించకండి. నేరుగా వెళ్లి సదరు బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకోవాలి. ఆన్‌లైన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు చెల్లించవద్దు' అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

ఖిలా వరంగల్: ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ, వ్యాపార, వాణిజ్యసంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు పక్కాగా రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి ప్రతినిధులు మంగళవారం హనుమకొండలోని కార్యాలయంలో వరంగల్ కలెక్టర్ గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాదిగ రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి నాయకుడు చింత భాస్కర్ మాట్లాడారు. ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలను చట్ట పరిధిలోనే కొనసాగించాలని, ఎస్సీ,ఎస్టీ యువతను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ, వ్యాపార, వాణిజ్య సంస్థలో పక్కా రిజర్వేషన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వినితిపత్రంలో కలెక్టర్‌ను కోరగా కలెక్టర్ పరిశీలిస్తానని చెప్పినట్లు ఆయన తెలిపారు. కట్టయ్య, ప్రభాకర్, శ్యాం ఉన్నారు.

రమాభాయి అంబేడ్కర్‌కు ఘననివాళి


నివాళులర్పిస్తున్న రైల్వే నాయకులు

కాజీపేట రూరల్: రమాభాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రణీత, ఉపేంద్ర, రమాదేవి, ఎం.సురేష్‌కుమార్, తిరుపతి, రాంచంర్, మర్యాల కృష్ణ, భాస్కర్, నరేష్, ఎంకె.మూర్తి, సీహెచ్.కొమ్మాలు, శివ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: రమాభాయి అంబేడ్కర్ జయంతని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల, హసన్‌పర్తిలో మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు రాము, ప్రగతిశీల రాష్ట్ర కన్వీనర్ చాతళ్ల సదానందం, ఉపాధ్యక్షురాలు మౌనిక, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సింగారపు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.